# 7

## వెంటబడ్డ వ్యక్తి

హైమవతి పూర్ణచంద్రరావుభార్య. పూర్ణ చంద్రరావు అంటే మేం చెన్నపట్నంలో అద్దెకున్న ఇంటికి యజమాని అన్న మాట. వాళ్ళు ముందు బంగళాలోనూ, మేము వెనకాల ఔట్ హౌస్‌లోనూ ఉండేవాళ్ళం.

హైమవతికి అప్పుడు పాతికేళ్లుంటాయి. ఇంకా సంతానం లేదు. ఐతేనేం, పిల్లలు లేరు కదా అని హైమవతికి కాలక్షేపానికి లోటు లేదు. వాళ్ళ ఇంట్లో 'టైగర్' అని ఒక కుక్క ఉండేది. ఆమెకా జాగిలం పది పిల్లల పెట్టు.

హైమవతి ఆ కుక్క విషయంలో తీసుకునే శ్రద్ధ ఇంతా అంతా కాదు. రోజూ సబ్బుతో తోమి 'బాత్' ఇస్తోండేది. మాంసం కొని

వేయిస్తోండేది. కన్న బిడ్డను చూసినట్లు చూసేది. ఓ మనిషి ఓ జంతువు మీద ఇంత వాత్సల్యం చూపడం నాకు అబ్బురం గానే ఉండేది.

'టైగర్' సంరక్షణకు పోగా మిగిలిన కాలం ఆవిడ ముస్తాబు చేసుకోడానికి సరిపోయేది. ముస్తాబంటే ఆషామాషీ సంసారపక్షం ముస్తాబు కాదు. 'ఐ-టచ్'లూ, 'నెయిల్ పాలిష్'లూ, 'లిప్‌స్టిక్'లూ, 'స్నో'లూ, వాసన నూనెలూ— ఇవన్నీ ఆవిడ నిత్యం వాడేది. ఆ పెదిమల పెయింటూ, ఆ గోళ్ళ రంగూ వగైరా వేషమంతా చూస్తే మా ఆవిడకు ఎంచేతనో గాని కిట్టేది కాదు.

"రోజూ బీచ్‌కి వెళ్ళి రావడానికి రంగస్థలాన్ని ప్రవేశించబోయే కథానాయికకు మల్లే ఇంత వేషం ఎందుకండీ, ఈవిడకు?" అంది రాజ్యం ఓనాడు నాతో. మరో నాడు, "అందమనేది సహజంగా ఉండాలి గాని, అవీ ఇవీ పూసుకుంటే వస్తుందా?" అని విమర్శించింది.

హైమవతి మా రాజ్యం అనుకున్నంత అనాకారి కాదు; తా ననుకునేటంత సుందరీ కాదు! ఆమెకు తాను చాలా అందమైన దానిననే అభిప్రాయముండేదని ఆ రోజుల్లో ఆవిడ వయ్యారం చూసినవాళ్లకూ, ఆ కబుర్లు విన్నవాళ్లకూ తెలుసు.

పూర్ణచంద్రరావు రోజూ ఆఫీసునుంచి తిరిగివచ్చే వేళకు ఆమె ముస్తాబై, సిద్ధంగా ఉండేది. ఆయన రావడంతోనే, 'టైగర్ని' కార్లో కూచోబెట్టుకుని, ఇద్దరూ బీచ్‌కి వెళ్ళిపోయే వారు. ఇలా ఉండగా, బకాయిపడ్డ శిస్తులు వసూలుచేసు

కోడానికి పూర్ణచంద్రరావు ఒకసారి వాళ్ళ ఊరు వెళ్ళి, పదిహేను రోజుల దాకా తిరిగి రాలేదు. ఆ లోపుగా ఇక్కడో చిత్రం జరిగింది.

ఇప్పుడు భర్తకోసం కనిపెట్టుకో నక్కరలేదు. కనుక, హైమవతి ఇంకా ముందుగానే ముస్తాబై, నాలుగ్గంటలకే కారును షెడ్లోంచి బయటకు తీసి, డైవర్ని కూచోబెట్టుకుని, స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ బీచ్‌కి వెళ్ళిపోయేది. ఆ వెళ్ళడం వెళ్ళి, రాత్రి ఏ ఎనిమిదో తొమ్మిదో ఐతే గాని తిరిగి ఇంటికి చేరుకునేది కాదు.

మా రాజ్యం "ఏమండీ, ఈవిడ ఒక్కర్తే ఇలా గంటల తరబడి ఎక్కడెక్కడో షికార్లు కొట్టిరావడం ఏమిటండీ?" అనేది.

ఇలా ఉండగా మా ఆవిడ 'దిష్టి' తగిలిందా అన్నట్టు హైమవతి బీచిషికార్లు హఠాత్తుగా ఆగిపోయాయి. ఐదోనాడు కాబోలు ఆవిడ ప్రొద్దు కుంకకుండానే ఇంటికి వచ్చేసింది. కారును షెడ్డులో పెట్టేసి, చర చరా బంగళాలోకి పోయింది.

మా రాజ్యం, 'ఏమిటి చెప్మా, ఇంత పెందరాళే వచ్చేసింది?' అని ఆశ్చర్యపోతూంటే, లోపలనుంచి హైమవతి భయంతో వొణికే కంఠంతో "రాజ్యంగారూ, ఓ మాటు ఇలా వస్తారా?" అని పిలిచింది.

మా ఆవిడ వెళ్ళి అట్టే కూచునిపోయి ఎప్పటికీ రాక పోవడం, మా ఇంట్లో పిల్లలు అన్నాలకు గోల ప్రారంభించడం

జరిగి, ఇంక రావలసిందని నేనే పెద్ద పిల్ల ద్వారా రాజ్యానికి కబురు పెట్టాను.

రాజ్యం ఇంట్లో అడుగు పెడుతూ, "ఇలాంటి దేదో జరుగుతుందని నే నెప్పుడో అనుకున్నాను!" అంది.

మా ఆవిడ మొదట ఏమనుకుందో, ఆ అనుకున్న లాంటిది ఆనాడు ఏం జరిగిందో మాత్రం నాకు కొంత సేపటి వరకూ తెలియలేదు.

చివరికి తేలినదేమిటంటే, హైమవతి ఆ సాయంత్రం బీచ్ కి వెళ్ళినప్పుడు, ఎవరో ఒక వ్యక్తి ఓ పెద్ద కార్లో వచ్చి, ఈవిడ వెంటపడ్డాడుట! వాడు తనను అలా అనుసరించి రావడం ఈమెకు అనుమానం కలిగించి, ఈవిడ తన కారును కాస్త జోరుగా నడిపించిందట. అప్పుడు వాడు కూడా తన కారు స్పీడు ఎక్కువచేసి, ఈమెకూడా వెనకాలే వచ్చాట్ట! ఈవిడ దాంతో హడలిపోయి, ఓ చిన్న సందులోకి తన కారు మళ్ళించి తప్పించుకుని వచ్చేసిందట.

"వాడుకూడా తన కారును సందులోకి మళ్ళించ లేదన్న మాట?"

ఈ మాట నేన నేసరికి మా రాజ్యం పిల్లలకు కంచాలు పెడుతున్నది మానేసి, వాడు తన కారును సందులోకి ఎందు చేత మళ్ళించలేదో కనుక్కోడానికంటూ హైమవతి దగ్గరికి పరుగెత్తింది.

మరి కాస్సేపటికి తిరిగి వచ్చి, "వాడు కూడా తన కారును ఆ సందులోకి మళ్ళిద్దామనే అనుకున్నాడటండీ. కాని,

అది ఆ సందు పట్టనంత పెద్ద కారట. ఆవిడ ఆ కారు పేరేమిటో చెప్పింది-మరిచిపోయాను. చాలా ఖరీదైనదట ఆ కారు. అలాంటివి మద్రాసంతటికీ చాలా కొద్దిగానే ఉన్నాయటండీ'' అంది. మా ఆవిడ చెప్పిందాన్నిబట్టి అది రోల్స్ రాయిస్ కారని నేను ఊహించగలిగాను. అప్పట్లో అలాంటి కార్లు ఓ డాక్టరుకూ, లాయరుకూ ఉన్నాయి. ఓ చెట్టియారుకు కూడా ఉంది. అలాంటి కార్లోనే జమీందారొకడు కూడా వెడుతూండడం చాలా సార్లు చూశాను.

హైమవతి తనకు భయంగా ఉందనీ, ఒంటరిగా పడుకోలేననీ అనడంవల్ల మా రాజ్యం ఆఖరి పిల్లాడ్ని తీసుకువెళ్ళి, ఆ రాత్రి ఆవిడకు సాయంగా పడుకుంది.

నేను ఆరుబయట కాంప్ కాట్ మీాద పడుకొని, ఆ సాయంకాలం బీచ్‌లో ఆమెను అలా వెంటాడివచ్చినవాడెవడై ఉంటాడా అని ఆలోచించడం మొదలుపెట్టాను. వాడు ఆ నలుగురిలో ఎవడై ఉంటాడు? నా మటుకు ఆ నలుగురూ ఘరానా మనుషులే అనిపించింది. ఇంతకీ హైమవతి అనవసరంగా భయపడిపోయి, వాడి దారిని వాడు వస్తూంటే తన కోసమేనని అపోహపడిపోయి, బాధపడిందేమో? వాడు ఓ వేళ దుర్మార్గపు బుద్ధితో వచ్చినా అంత పబ్లిక్‌గా వెంటాడి ఏం చేద్దామని? ఇలా ఆలోచిస్తూంటే నాకు నిద్ర పట్టేసింది.

మరునాడు ఆదివారం నేను తీరిగ్గా దంతధావన చేస్తుంటే మా రాజ్యం, "ఏం చేస్తే బాగుంటుందండీ?'' అంది.

"ఏ విషయం?''

"హైమవతమ్మ మాట."

"చెయ్యడాని కేముంది ? పూర్ణచంద్రరావుగారు వచ్చేదాకా ఈవిడ బీచ్ మానేస్తే సరి..."

ఈ ఆలోచనతో హైమవతి కూడా ఏకీభవించింది. దాంతో ఇంక ఆ సంగతి వదిలేశాం.

మధ్యాహ్నం భోజనం అయ్యాక నేను వాలుకుర్చీలో నడుం వాల్చేసరికి, కునుకు పట్టింది. వరహా కిమ్మత్తయిన కును కది. ఐతేనేం? రాజ్యం, హైమవతీ వచ్చి లేపేశారు !

"ఏమండోయ్, వాడేట, వచ్చాడు. ఎలా కనుక్కు న్నాడో ఇంటికే వచ్చాడుట – దుర్మార్గుడు!" అంటోంది రాజ్యం.

"ఎవడు?" అంటూ నేను ఉలిక్కిపడి లేచి బయటకు వచ్చి చూసేసరికి మా బంగాళా ముందు కారొకటి కనబడింది. అది 'రోల్సురాయిసే'. అందులో నేననుకొన్న లాయరూ, డాక్టరూ, చెట్టియారూ కాక నాలుగోవాడైన జమీందారు కూర్చొని ఉన్నాడు.

నేను లోపలికి వచ్చేసి, కర్తవ్యమేమిటని ఆలోచిస్తు న్నాను. హైమవతి కళవళపడిపోతోంది! ఆవిడకు ముచ్చె మటలూ పోసేశాయి. మా రాజ్యం నా చేతికర్ర పట్టుకొచ్చి, నా పక్కన పెట్టింది, తాను చీపురుకట్ట పట్టుకుంది!

"ఆయన నిజంగా ఏదో దుర్మార్గపు బుద్ధితోనే వచ్చా డంటావా?" అన్నాను.

"ఇంకా సందేహమేమిటి?" అంది రాజ్యం.

నేను ఏం చెయ్యాలో పాలుపోక కిటికీలోంచి బయటకు చూస్తూంటే, ఆ జమీందారు అటూ ఇటూ చూస్తూ సందేహిస్తూ మెల్ల మెల్లగా బంగళా దగ్గరికి వచ్చాడు. గుమ్మంవద్ద అతనికి ఎవరూ ఎదురు కాలేదు. అటుపైన అతను తిన్నగా హాల్లోకి వెళ్ళడం చూశాను. నే నలా ఆలోచిస్తూ నిలబడిపోవడం హైమవతికి నచ్చలేదు. ఆమెకు ఉన్నట్టుండి ఒక ఆలోచన తట్టింది.

"అన్నగారూ, నేను వెళ్లి వాడితో మాట్లాడుతాను. మీరు వెనకాల కాచుకొని ఉండండి. వాడి నోటమ్మట ఏదైనా తప్పు మాట వచ్చిందా, ముందుకు రండి," అంది.

హైమవతి ఇలా మాతో చెప్పి, ధైర్యంగా హాల్లోకి వెళ్ళింది.

"రండి, అలా చూస్తారేం?" అంటూ నడిచింది మా రాజ్యం.

నేను మంత్రముగ్ధుడికి మల్లే ఆమెను అనుసరించి వెళ్లాను.

చీపురు పుచ్చుకొని రాజ్యమూ, కర్ర పుచ్చుకొని నేనూ తలుపు వెనకాల రెండు పక్కలా కాచుకొని ఉన్నాం.

హైమవతి హాల్లో ప్రవేశించడం తడవుగా జమీందారు లేచి, వినయంతో, "నమస్కారమండీ," అన్నాడు.

"నమస్కారం! ఎవరు మీరు?"—హైమవతి దురుసుగానే అడిగింది.

అతను కొంచెం కంగారుపడి చేతులు నలుపుతూ,

"నిన్న సాయంకాలం బీచ్‌లో తమరిని కారులో చూసినప్పుడే మనవి చేద్దామనుకున్నాను. కాని, తమరు కారు ఆపారే కాదు. తను కారు నెంబరు నోటు చేసుకొని, పోలీసు కమీషనరు ఆఫీసులో వాకబు చేసి, అతి కష్టంమీద తమ అడ్రసు కనుక్కున్నాను."

"ఎందుకని?"

"తమరు మరోలాగ అనుకోకపోతే మనవి చేస్తాను. నిన్న కారులో చూసినప్పటినుంచీ నేను మనసు తిప్పుకోలేక పోతున్నాను."

హైమవతి ముఖం ఎర్రబడింది.

మా రాజ్యం ఒక అడుగు ముందుకు వేసింది. "పదండి" అన్నట్లు నాకు సంజ్ఞ చేసింది.

మరు క్షణంలో నేనూ, మా రాజ్యం హాలులో ప్రత్యక్షమై ఉండేవాళ్ళమే!

కాని, జమీందారు తను చెప్పబోయింది పూర్తి చేశాడు: "ఎన్నాళ్లనుంచో మీ వద్దనున్న జాగిలంలాంటిదాని కోసం ప్రయత్నం చేశాను. దొరకలేదు. తమరు ఎంత వెల చెబితే అంతా ఇస్తాను. మీ జాగిలాన్ని నాకు దయ చేయించండి."

హైమవతి ఆ మాట విని కుర్చీలో కూలబడిపోయింది! తాను కన్న బిడ్డకు మల్లే సాకుతూన్న 'టైగర్'ను జమీందారు ఇవ్వమన్నందుకు ఆమె బాధపడుతోందని అనుకొన్నాను మొదట. ఒక నిమిషం అయ్యాక ఆవిడ చివాలున లేచి,

'టైగర్' ఉన్న చోటికి చరచరా వెళ్లింది. ఆ కుక్క మెడకు గొలుసు వేసి లాక్కువచ్చి, "ఇదిగో-తీసుకువెళ్లండి!" అనేసింది.

జమీందారు వికసించిన ముఖంతో "ధర సెలవిచ్చారు కారు," అన్నాడు.

అందు కామె "నాకు ఏమీ ఇవ్వనక్కరలేదు. తీసుకు పొండి! మళ్లీ దీని మొహం నాకు కనబడకుండా చెయ్యండి!" అంటూ జేవురించిన ముఖంతో తన గదిలోకి వెళ్ళిపోయింది.

'టైగర్' జాలిగా హైమవతి వెళ్లిన వైపు చూస్తూ పెనుగులాడుతూంటే, జమీందారు దాన్ని లాక్కుపోయి కారు ఎక్కించాడు.

ఆ దృశ్యం నా మనస్సును చివుక్కుమనిపించింది.

హైమవతి టైగర్ని అలా ఎందుకు ఇచ్చేసిందో కొంత సేపటికిగాని అర్థంకాలేదు నాకు...ఆనాటి వరకూ ఆమె తాను 'భువనైకసుందరి' ననుకొనేది. జమీందారు తన వెంట పడడం తన అందాన్ని చూసే అనుకుంది! అందరుపతివ్రతలకు మల్లేనే అందు కామె బాధపడింది. సంగతి తెలిశాక "బ్రతుకు జీవుడా!" అని సంతోషించి, 'కుక్క నివ్వడానికి వీల్లే'దని మంచిగా చెప్పి పంపించెయ్యవలసింది కాని, ఆమె అలా చెయ్యలేదు. 'ఆ జమీందారును ఆకర్షించింది తన సౌందర్యం కాక ఆ కుక్క' అని తెలియడంతో దానిపై నగల ప్రేమంతా ఒక్కమాటుగా పోయి, ఆమె టైగర్ని చేతులారా ఇచ్చేసింది. ఇంక మళ్లీ దాని మొహంకూడా కనబడరాదట! ఎంత అసూయ!